క్లుప్తంగా

డిజిటల్ విద్యను సద్వినియోగం చేసుకోవాలి

కొలిమిగుండ్ల: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రపంచంతో పోటీ పడాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్ విద్యకు శ్రీకారం చుట్టిందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ అబ్దుల్ కలాం సూచించారు. గురువారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో మండలంలోని పది ఉన్నత పాఠశాలలు, మోడల్ స్కూల్, కస్తూర్బాకు చెందిన ఎనిమిదవ తరగతి విద్యార్థులకు మంజూరైన 507 ట్యాబ్‌లను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు అందజేశారు.

గాయపడిన వ్యక్తి మృతి

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల–అవుకు ఆర్‌అండ్‌బీ రహదారిలో ఈనెల 11న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి చెందాడు. గురువారం కోవెలకుంట్లల ఎస్‌ఐ వెంకటరెడ్డి అందించిన సమాచారం మేరకు అవుకు మండలం శింగనపల్లె గ్రామానికి చెందిన వెంకటసుబ్బారెడ్డి(45) సొంత పనుల నిమిత్తం బైక్‌పై ఆళ్లగడ్డకు వెళ్లి తిరుగు ప్రయాణం అయ్యాడు. పట్టణ శివార్లలోని రైల్వే వంతెన సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. వెంకటసుబ్బారెడ్డితో పాటు ఆటోలో ప్రయాణిస్తున్న దొర్నిపాడు మండలం క్రిష్టిపాడుకు చెందిన నాగూరుబాషా గాయపడ్డారు. వెంటకసుబ్బారెడ్డి పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలుక మృతి చెందినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

యువకుడు అదృశ్యం


మాదవయ్య (ఫైల్)

సంజామల: మండల పరిధిలోని మిక్కినేనిపల్లె చెందిన యువకుడు అదృశ్యమైనట్లు ఏఎస్‌ఐ నాగరాజు గురువారం తెలిపారు. గ్రామానికి చెందిన సుధాకర్ రామలక్ష్మమ్మ దంపతుల కుమారుడు మాదవయ్య డిగ్రీ వరకు చదువుకొని హైదరబాద్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 1వతేదీ హైదరాబాద్ నుంచి గ్రామానికి వచ్చిన మాదవయ్య 5వతేదీన వెళ్లాడు. అయితే 6వతేదీ మాదవయ్య స్నేహితుడు తలారి వేణుగోపాల్ ఇంటికి ఫోన్ చేసి మీ కుమరుడి ఫోన్ పనిచేయడం లేదని చెప్పాడు. బంధువులు, స్నేహితులను ఆరా తీశారు. పది రోజులైనా ఆచూకి తెలియక పోవడంతో యువకడి కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

అభ్యంతరం లేదు

ప్యాపిలి : మండల పరిధిలోని వెంగళాంపల్లి గ్రామనికి చెందిన ఆర్మీ జవాన్ కొండాపురం హరిబాబుకు ప్రభుత్వ భూమి సర్వే నంబరు 371లో ఇవ్వడానికి తమకు అభ్యంతరం లేదని గురువారం డిప్యూటీ తహసీల్దార్ మారుతికి గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు. అయితే పొలాలకు వెళ్లేందుకు రస్తా వదిలి పెట్టాలని విన్నవించామని రైతులు కొండన్న, రామాంజనేయులు, తిరుపాలు, రామయ్య, మద్దిలేటి తదితరులు తెలిపారు.

ఆక్రమణ బోరును పరిశీలించిన రెవెన్యూ అధికారులు

డోన్ : ప్రభుత్వ స్థలంలోని బోరుకు మోటార్ ఏర్పాటు చేసుకుని పంట పొలాలకు వాడుకుంటున్నందున నీటి సమస్య ఏర్పడిందని పట్టణ శివారులోని లెప్రసీ కాలనీ సమీపానున్న ఆర్‌ఈ రవికుమార్ కాలనీ ప్రజలు గురువారం తహసీల్దార్ విద్యాసాగర్‌కు ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు వీఆర్‌ఓలు రామక్రిష్టారెడ్డి, యూనుస్ బోరును పరిశీలించారు. బోరుపై ఉన్న హక్కుకు సంబంధించిన ఆధారాలతో రెండురోజుల్లో తహసీల్దార్ ఎదుట హాజరు కావాలని రైతుకు వీఆర్‌ఓలు సూచించారు. లేని పక్షంలో బోరును ప్రజలకు స్వాధీనం చేస్తామని వారు హెచ్చరించారు.

సీఎస్‌ఆర్ నిధులతో అభివృద్ధి పనులు

కొలిమిగుండ్ల: సామాజిక బాధ్యత కింద సీఎస్‌ఆర్ నిధులతో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నామని రామ్‌కో సిమెంట్ యూనిట్ హెడ్ రెడ్డినాగరాజు తెలిపారు. గురువారం సాయంత్రం కొలిమిగుండ్లలో కంపెనీ ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ నుంచి తేరుమిద్దె సమీపం వరకు ప్రధాన రహదారిలో పూర్తయిన సెంట్రల్ లైటింగ్ పనితీరును పరిశీలించారు. రోడ్డు డివైడర్ పనులు సోమవారం నాటికి పూర్తి చేయించాలని సిబ్బందికి సూచించారు. ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సిమెంట్ రోడ్డు,బస్టాండ్ వెనుక భాగంలో నిర్మిస్తున్న ప్రహరీ, ఆధునీకరించిన టాయ్‌లెట్లను ఆయన పరిశీలించారు. వారం రోజుల్లో అభివృద్ధి పనులను ప్రారంభోత్సవం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఆయన వెంట జనరల్ మేనేజర్ రవికుమార్, సిబ్బంది ఉన్నారు.

మంగంపేటలో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర

అవుకు: మండల పరిధిలోని మంగంపేటలో గురువారం ఎంపీడీఓ వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కా ర్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర ప్రభు త్వ సంక్షేమ పథకాలను అధికారులు ప్రజలకు వివరించారు. సంచార వాహనం ద్వారా ప్ర ధాని మోడీ ప్రసంగాన్ని టీవీ ద్వారా చూపించారు. అనంతరం రైతులకు డ్రోన్ వలన కలిగే ప్రయోజనాలను తెలిపా రు. కార్యక్రమంలో ఏఓ అబ్దుల్ హక్, ఈఓఆర్‌డీ రామక్రిష్ణవేణి, హౌసింగ్ ఏఈ క్రిష్టారెడ్డి, ఏపీఎం విజయగోపాల్, డాక్టర్లు వినోద్‌కుమార్, యమునా, సర్పంచ్ లక్షితులసమ్మ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఆరోగ్య భరోసా !

- రూ.2.43 కోట్లతో అవుకు 30 పడకల ఆసుపత్రి అభివృద్ధి
- సకల సదుపాయాలతో సీహెచ్‌సీ
- ప్రజలకు అందుబాటులో 24 గంటల వైద్య సేవలు
- సంతోషం వ్యక్తం చేస్తున్న మండల ప్రజలు


అవుకు సామాజిక ఆరోగ్య కేంద్రం

అవుకు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజారోగ్యానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తుంది. గ్రామాల్లో హెల్త్ క్లినిక్‌లను నెలకొల్పి నేరుగా వైద్య సేవలు అందజేస్తున్న ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ తీసుకొచ్చి దీర్ఘకాలిక రోగులకు ఇళ్ల వద్దనే ఇళ్ల వద్దనే ఆరోగ్య పరీక్షలు అందజేస్తూ అందరిమన్ననలు పొందుతోంది. అదేవిధంగా పీహెచ్‌సీ, సీహెచ్‌సీలలోనూ రోగులకు అనుగుణంగా అన్ని వసతులు కల్పించి పేదలకు ఆరోగ్య భరోసాను కల్పిస్తుంది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. ఈ నేపథ్యంలో మండల కేంద్రం అవుకులోని పీహెచ్‌సీకి మహర్దశ చేకూరింది. దశాబ్దం క్రితం అవుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ) సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ) 30 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ అయ్యింది. ఆనాటి నుంచి 30 పడకల ఆసుపత్రి అవుకులో ఉందనే మాటే తప్పా.. ఇక్కడ సరైన వైద్య సిబ్బంది, సౌకర్యాలు కల్పించలేదు గత ప్రభుత్వం. దీంతో మండల ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. చిన్నపాటి వైద్య పరీక్షలకైనా నియోజకవర్గ కేంద్రం, జిల్లా ఆసుపత్రులకో వెళ్లాల్సిన పరిస్థితులు ఉండేవి. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆసుపత్రి తీరు పూర్తిగా మారిపోయింది. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి చొరవతో అవుకు ఆసుపత్రి సమస్యలను సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకెళ్లి రూపురేఖలు మార్చేశారు. అవుకు ఆసుపత్రిలో సకల సదుపాయాలు కల్పించారు. ప్రత్యేకించి ఆసుపత్రిలో వైద్య సిబ్బంది కొరత లేకుండా కృషి చేశారు. చికిత్సల కోసం ఇతర ప్రాంతాల ఆసుపత్రికి వెళ్లాల్సిన తిప్పలు తప్పాయి. అనస్థీషియా, పిడియాట్రిక్స్, జనరల్ సర్జరీ, గైనకాలజీ, డెంటల్, జనరల్ అసిస్టెంట్ సర్జన్లు ముగ్గురు డాక్టర్లను కూడా నియమించారు. దీంతో వైద్య సేవలు మెరుగ్గా అందుతున్నాయి. దీంతో మండల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఇది కదా.. అభివృద్ధి

రూ.2.43 కోట్లతో 30 పడకల ఆసుపత్రి అభివృద్ధి

మండల కేంద్రంలోని 30 పడకల ఆసుపత్రిలో వైద్య సదుపాయాలు లేక, సేవలు అందకపోవడంతో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి చొరవ వసుతుల కల్పనకు చర్యలు తీసుకున్నారు. 2020లో ఆసుపత్రి అభివృద్ధికి రూ.2.40 కోట్లు మంజూరు చేయించారు. దీంతో రెండు ఆపరేషన్ థియేటర్‌లను ఎయిర్ కండీషన్‌తో ఆధునీకరించారు. ఆసుపత్రికి ఒక కనెక్టింగ్ బ్లాక్‌ను నిర్మించి, అందులో రెండు డెలివరీ రూమ్‌లను ఏర్పాటు చేశారు. అలాగే ఆసుపత్రి ప్రాంగణంలోనే పోస్టుమార్టం రూమ్, పేషెంట్స్ అటెండర్స్ రూమ్, బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూమ్, అంబులెన్స్ షెడ్, విద్యుత్ అంతరాయాలు రాకుండా జనరేటర్, ఇందుకోసం ప్రత్యేక షెడ్‌ను ఏర్పాటు చేశారు. ఆసుత్రిలో ఎలాంటి పరిస్థితుల్లోనూ ఆక్సిజన్ కొరత రాకుండా ప్రాంగణంలోనే ఆక్సిజన్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి, గదులకు కనెక్షన్లు ఇచ్చారు. అలాగే నీటి అవస్థలు రాకుండా బోరును వేయించి నీటి సంప్‌లు ఏర్పాటు చేశారు. అదేవిధంగా ఆసుపత్రి ప్రాంగణంలో సీసీ రోడ్లను, డ్రైనేజీలను నిర్మించారు. నూతనంగా నిర్మించిన భవనాలను, సీహెచ్‌సీ గోడలకి వైద్య సంబందిత పెయింటింగ్‌లు వేసి సుందరంగా తీర్చిదిద్దారు. వైద్య సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రావడంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోపాటు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి మండల ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.


నూతనంగా నిర్మించిన పోస్టుమార్టం రూమ్


సీహెచ్‌సీకి నూతనంగా నిర్మించిన కనెక్టింగ్ బ్లాక్


సీహెచ్‌సీ ప్రాంగణంలో నిర్మించిన పేషెంట్స్ అటెండర్స్ రూమ్

అందుబాటులో సకల ఆరోగ్య సేవలు



అవుకు సీహెచ్‌సీలో అభివృద్ధి పనులు శరవేగంగా పూర్తయ్యాయి. దీంతో ప్రజలకు సకల ఆరోగ్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఐదు డిపార్ట్‌మెంట్లకు చెందిన వైద్యులు అందుబాటులో ఉన్నారు. స్కిన్ సర్జరీలు, సుఖ ప్రసవాలు, చిన్న పిల్లలకు ప్రత్యేక చికిత్సలకు సంబంధించి ఆపరేషన్ థియేటర్‌లు ఉన్నాయి. త్వరలోనే సిజేరియన్‌కు సంబంధించిన పరికరాలు రానున్నాయి, సిజేరియన్ ప్రసవాలను కూడా ఆసుపత్రిలో చేస్తాం. ఇవే కాకుండా మరెన్నో వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ అభినయ్ అవుకు సీహెచ్‌సీ సూపరింటెండెంట్

గతంలో ఇలాంటి అభివృద్ధి చూడలేదు



గతంలో ఎన్నడూ అవుకు ఆసుపత్రిలో ఇలాంటి అభివృద్ధి చూడలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎన్నో సౌకర్యాలు కల్పించింది. నా వయసు దాదాపు 75 ఏళ్లు. నా కుడి కాలికి గాయం కావడంతో రెండున్నరేళ్లుగా కాలికి అల్సర్(చర్మం లేకుండా) వచ్చింది. బాధను తట్టుకోలేక అవుకు ఆసుపత్రికి వచ్చిన తనకు డాక్టర్లు పరిశీలించి దాదాపు రెండు నెలలు నన్ను వారి పర్యవేక్షణలో ఉంచుకొని స్కిన్ సర్జరీ చేశారు. సర్జరీ అనంతరం నాలుగు రోజులు ఆసుపత్రిలోనే ఉంచుకొని ప్రతిరోజు ఖరీదైన మందులు ఇచ్చారు. ఇప్పుడు నా కాలు బాగైంది. ఆసుపత్రిలో అన్ని సౌకర్యాలు ప్రభుత్వం అందుబాటులో ఉంచడంతోనే నాకు మంచి జరిగింది. డాక్టర్లతోపాటు ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

– వెంకట సుబ్బారెడ్డి, సుంకేసుల, అవుకు

ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది



కోట్లాది రూపాయలను ఖర్చు చేసి ఆసుపత్రిని అభివృద్ధి చేయడం వలన మండల పరిధిలోని ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది. డబ్బు ఖర్చు పెట్టుకుని ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లాల్సిన అవసరం ఉండదు. వైద్య సేవల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా అవుకు ఆసుపత్రిలోనే మెరుగైన ఆరోగ్య సేవలు అందిస్తున్నారు. నాకు వాంతులు, విరేచనాలు కావడంతో నా భార్య నన్ను ఆసుపత్రికి తీసుకొచ్చిన వెంటనే డాక్టర్లు ముందుకు వచ్చి చికిత్స చేశారు. నా పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు.

– నాగార్జున, అవుకు

యువత క్రీడల్లో రాణించాలి


విజేత జట్టుతో వైఎస్సార్‌సీపీ నేత చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి

అవుకు: యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని వైఎస్సార్‌సీపీ నేత చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల మైదానంలో తహసీల్దార్ పోతుల ప్రసాద్ బాబు ఆధ్వర్యంలో గురువారం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం నిర్వహించారు. కొన్ని రోజులుగా మండల స్థాయిలో క్రీడా పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా చల్లా మాట్లాడుతూ యువతి యువకుల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు చేపట్టిందన్నారు. జిల్లా స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో ఆడే అవకాశాలు ఉంటాయని, క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఉప్పలపాడు, శింగనపల్లె గ్రామాల క్రీడాకారులకు కబడ్డీ పోటీలు నిర్వహించారు. నాలుగు పాయింట్లతో గెలుపొందిన ఉప్పలపాడు టీమ్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఏఓ వెంకటేశ్వర్లు, హౌసింగ్ ఏఈ క్రిష్టారెడ్డి, ఈఓ అశ్విన్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీలకు విద్యార్థి


సాయిసుమంత్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే కాటసాని

బనగానపల్లె రూరల్ : బనగానపల్లె పట్టణంలోని నాయీ బ్రహ్మణ కాలనీకి చెందిన విద్యార్థి సాయిసుమంత్ జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ మేరకు గురువారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తన స్వగృహంలో సాయిసుమంత్‌ను అభినందించారు. ఎమ్మెల్యేమాట్లాడుతూ ఇటీవల తెలంగాణలోని మహబూబ్‌నగర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి నెట్ బాల్ పోటీల్లో సాయిసుమంత్ ప్రతిభ చాటి జాతీయ పోటీలకు ఎంపిక కావడం సంతోషకరమన్నారు. విద్యార్థికి తమవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి, నాయీ బ్రహ్మణ సంఘం అధ్యక్షుడు, ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు మధుసూదన్‌రావు, గౌరవాధ్యక్షులు శ్రీరాములు, తల్లిదండ్రులు వెంకటసుబ్బయ్య, మాధవి,వార్డు సభ్యులు సురేష్ పాల్గొన్నారు.

నేడు అంబేడ్కర్ విగ్రహావిష్కరణ


బేతంచెర్ల: జెండా ఊపి బస్సులను విజయవాడకు సాగనంపుతున్న చలంరెడ్డి


డోన్ : ప్రత్యేక బస్సులో విజయవాడకు వెళ్తున్న అభిమానులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

- విజయవాడకు తరలివెళ్లిన అభిమానులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు

బేతంచెర్ల: విజయవాడలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భారీ విగ్రహాన్ని ఈ నెల 19న సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆవిష్కరించనున్నారు. అంబేడ్కర్ త్యాగాలకు గుర్తుగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా విజయవాడలోని చారిత్రక స్వరాజ్య మైదానంలో 206 అడుగుల ఎత్తైన ఆయన విగ్రహాన్ని సీఎం ఆవిష్కరిస్తున్న నేపథ్యంలో ప్రజలు తరలివెళ్లారు. అంబేడ్కర్ అభిమానులు, కుల సంఘాల నాయకులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు గురువారం ఉత్సాహంగా బయలు దేరారు. బేతంచెర్ల మండలం నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కుల సంఘాల నాయకులు గురువారం రాత్రి రెండు బస్సుల్లో బయలు దేరి వెళ్లారు. ఈ మేరకు పట్టణంలో నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి జెండా ఊపి బస్సులను ప్రారంభించారు.

డోన్ టౌన్ : అంబేడ్కర్ విగ్రహ విష్కరణ కార్యక్రమానికి డోన్ పట్టణం నుంచి అభిమానులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. కౌన్సిలర్ రైల్వే నాగేంద్ర, ఎస్సీ, ఎస్టీ మైనారిటీ సెల్ పట్టణ అధ్యక్షుడు రాజశేఖర్ ఆధ్వర్యంలో విజయవాడకు ప్రత్యేక బస్సులో తరలి వెళ్లారు. ఈ బస్సును మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ జెండా ఊపి సాగనంపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మహేశ్వరరెడ్డి, మల్లికార్జున రెడ్డి, సుంకన్న, నాయకులు కురుకుందు హరి, మల్యాల శ్రీనివాసరెడ్డి, గంగా, సుధాకర్, మధుసూదన్, మేడా రఘు, సుంకన్న, శేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

అవుకు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి అవుకు నుంచి అభిమానులు తరలి వెళ్లారు. అవుకు మండలం నుంచి దాదాపు 50 మంది కార్యక్రమాన్ని తిలకించేందుకు బయల్దేరారని ఏఓ వెంకటేశ్వర్లు, ఈఓ అశ్విన్ కుమార్ తెలిపారు.

కొలిమిగుండ్ల: విజయవాడ స్వరాజ్ మైదానంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు గురువారం కొలిమిగుండ్ల నుంచి అభిమానులు తరలివెళ్లారు. బస్సును సూపరింటెండ్ ప్రసాదరెడ్డి, ఈఓఆర్డీ శ్రీహరి జెండా ఊపి సాగనంపారు.

అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణను విజయవంతం చేద్దాం

బేతంచెర్ల: విజయవాడలో శుక్రవారం నిర్వహించనున్న అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని వైఎస్సార్‌సీపీ మండల సీనియర్ నాయకులు బాబుల్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో గురువారం సిమెంట్ నగర్‌లో నాయకులు బండి కుమార్, నాగరాజు ఆధ్వర్యంలో బాబుల్‌రెడ్డి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.


అవుకు: విజయవాడకు బయల్దేరుతున్న బస్సు


కొలిమిగుండ్ల : విగ్రహావిష్కరణకు కార్యక్రమానికివెళ్తున్న అభిమానులు

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

- ప్రతి పల్లెను అభివృద్ధి చేస్తున్నాం
- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి


క్రిష్టగిరి గ్రామంలో రూ.20లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె : ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు. మండల కేంద్రాలతోపాటు ప్రతి పల్లెను అభివృద్ధి చేస్తున్నామని, మౌలిక వసతుల కల్పనకు అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నామని చెప్పారు. మండలంలోని కృష్ణగిరి, చెర్లోకొత్తూరు గ్రామాల్లో గురువారం రూ.42 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, పైప్‌లైన్, రెండు వాటర్ ప్లాంట్స్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ గ్రామీణులు అవసరాలను గుర్తించి పరిష్కార చర్యలు చేపడుతున్నామన్నారు. క్రిష్టగిరి గ్రామంలో రూ.20లక్షలతో సీసీ రోడ్డు, రూ.12లక్షలతో నూతనంగా పైప్‌లైన్ నిర్మాణం, రూ.5లక్షలతో మినరల్ వాటర్ ప్లాంట్, చెర్లోకొత్తూరు గ్రామంలో రూ.5లక్షలతో మినరల్‌వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశామన్నారు. చెర్లోకొత్తూరు గ్రామంలో రూ.40లక్షలతో ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకు పైప్‌లైన్ నిర్మాణ పనులు జరుగుతున్నాయని, వీటి నిర్మాణ పనులు పూర్తికాగనే గ్రామంలో 24 గంటలు మంచినీటి సౌకర్యం అందించడం జరుగుతుందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా ఇచ్చిన హామీ మేరకు చెర్లోకొత్తూరులో సీసీ రోడ్డు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. క్రిష్టగిరి చెర్లోకొత్తూరు గ్రామాల మధ్య రోడ్డు సౌకర్యం పూర్తిగా ఇబ్బందిగా ఉండేదని, ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు తారు రోడ్డు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. క్రిష్టగిరి మెట్ట నుంచి కాశీరెడ్డినాయన ఆశ్రమం వరకు తారు రోడ్డు ఏర్పాటుకు రూ.22 కోట్లు మంజూరు అయ్యాయని, త్వరలో నిర్మాణ పనులు ప్రారంభిస్తామని చెప్పారు. అదేవిధంగా అర్హులైన పేదలందరికీ భూ పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. సీఎం వైఎస్ జగన్ సహకారంతో నియోజకవర్గంలో సంక్షేమంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుండగా టీడీపీ నాయకులు రోడ్లు అభివృద్ధి జరగలేదని విమర్శించడాన్ని వారి విజ్ఞతకే వదలివేస్తున్నామని పేర్కొన్నారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివరామయ్య, ఏఈలు మహేష్, సాయికృష్ణ, అవుకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి, ఎంపీపీ మానసవీణ, సర్పంచ్ సుజాత, వైఎస్సార్ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, మాధవరెడ్డి, రామసుబ్బారెడ్డి, తోటబుచ్చిరెడ్డి, చిన్నపురెడ్డి కృష్టారెడ్డి ఈశ్వర్‌నాయక్ తిరుపాల్, చిన్న రామసుబ్బారెడ్డి, శీలాయాగంటిరెడ్డి తదితర వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రణాళికతోనే గ్రామాల అభివృద్ధి

కొలిమిగుండ్ల: ప్రణాళికతోనే గ్రామ పంచాయితీల అభివృద్ధి సాధ్యపడుతుందని సూపరింటెండ్ ప్రసాదరెడ్డి, ఈఓఆర్డీ శ్రీహరి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ మీటింగ్ హాల్‌లో పంచాయితీ అభివృద్ధిపై సర్పంచ్‌లు,పంచాయితీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి నిర్వహించిన రెండు రోజులు శిక్షణ గురువారం ముగిసింది. ఈసందర్బంగా వారు మాట్లాడుతూ పంచాయితీల్లో ఆదాయ మార్గాలు అన్వేషించి మరింత అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన మార్గదర్శకాల గురించి వివరించారు.

నేడు ముస్లింల ఆత్మీయ సమావేశం

బనగానపల్లె : బనగానపల్లె పట్టణంలో శుక్రవారం ముస్లిం సోదరుల ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రచార కార్యదర్శి సిద్దం రెడ్డి రామ్మోహన్‌రెడ్డి గురువారం తెలిపారు. స్థానిక మర్కస్ మజీద్ వద్ద మధ్యాహ్నం రెండు గంటల నుంచి నిర్వహించే ఈ ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి హాజరవుతారన్నారు. పట్టణంలోని ముస్లిం మైనార్టీ సోదరులు, ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, బూత్ కమిటీ సభ్యులు, గృహసారధులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ఉత్కంఠంగా సాగిన క్రికెట్ పోటీలు

సంజామల: మండల పరిధిలోని పేరుసోములలో గురువారం వ్యాయమ ఉపాధ్యాయుడు ప్రతాప్ పర్యవేక్షణలో ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రికెట్ సెమీ ఫైనల్ పోటీలు జరిగాయి. ఆల్వకొండ, గిద్దలూరు సెమీ ఫైనల్ మ్యాచ్ ఉత్కంఠంగా సాగింది. హోరాహోరీగా సాగిన ఈ మ్యాచ్ డ్రా అయ్యింది. సూపర్ ఓవర్‌లో ఆల్వకొండ టీంపై గిద్దలూరు విజయం సాధించింది. ఈ మేరకు విజేత జట్టును ప్రతాప్ అభినందించారు.

మానసిక ప్రశాంతతతో ఆరోగ్యమైన జీవనం

బేతంచెర్ల: మానసిక ప్రశాంతతతో ఆరోగ్యకరమైన జీవనం కొనసాగించవచ్చని ప్రజాపిత బ్రహ్మ కుమారి మాధవి అన్నారు. గురువారం స్థానిక ఓం శాంతి నిలయంలో ప్రజాపిత బ్రహ్మబాబా వర్ధంతిని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మానవుడు దైనందిన జీవితంలో మానసిక ఒత్తిడి లేకుండా మెడిటేషన్‌తోపాటు విలువలతో కూడిన జీవన విధానం కోసం ఓం శాంతి నిలయాన్ని సందర్శించాలని సూచించారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు


మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె రూరల్ : సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో పార్టీలు, కులమతాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పేదలందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు. బనగానపల్లె పట్టణంలోని సచివాలయం–2 పరిధిలోని గోపాల్ నగర్, బీసీ కాలనీల్లో గురువారం ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. అవుకు,బనగానపల్లె మండలాల వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు కాటసాని తిరుపాల్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, సర్పంచ్ ఈసారి యల్లమ్మలతో కలిసి ఆయా కాలనీల్లో విస్తృతంగా పర్యటించారు. ఆయా కాలనీ ప్రజలు ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికారు. గడప గడపకు వెళ్లి ప్రభుత్వ పాలన తీరును వివరించడంతోపాటు ప్రజలతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి చేకూరి లబ్ధి వివరాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీలు, నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి ఉండేదన్నారు. ప్రత్యేకించి పింఛన్ మంజూరవ్వాలంటే పాత లబ్ధిదారులు మరణిస్తేనే కొత్త వ్యక్తికి అవకాశం అనే దుస్థితి ఉండేదన్నారు. అయితే వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సీఎం అయ్యాకా సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను తీసుకొచ్చి నేరుగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. పింఛన్‌కు ఎంతమంది అర్హత ఉంటే వారందరికీ ఎవ్వరి సిఫారసు లేకుండానే అందజేస్తున్నారని వివరించారు. అర్హత ఉన్న టీడీపీ వారికి కూడా ఏ మాత్రం తేడా చూపకుండా పింఛన్, సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత సీఎం జగనన్నకే దక్కిందన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో టీడీపీ నాయకులు చేస్తున్న మోసపూరిత వాగ్దానాలు నమ్మొద్దని సూచించారు. ప్రజల వద్దకే పాలన కొనసాగించేందుకు మరోమారు వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివ రామయ్య, పీఆర్ ఏఈ మహేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయికృష్ణ, ఎంఈఓలు స్వరూప, శ్రీనివాసులు, సచివాలయ కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, వెల్ఫేర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు, డిజిటల్ అసిస్టెంట్ సురేంద్ర, డాక్టర్ మహమ్మద్‌హుస్సేన్, మండల కో ఆప్షన్ సభ్యులు అనిల్, మాజీ ఎంపీటీసీ సభ్యులు అబ్దుల్‌ఫైజ్, వార్డు సభ్యులు సురేష్, నాయకులు దేవుడు, రమణ, విజేయుడు, నరసన్న, చిన్నస్వామి, పెద్ద నరసన్న, ఈడిగ సుబ్బరాయుడు, చాకలిసుధాకర్, చాకలి నాగన్న, చాకలి సుబ్బారాయుడు, ఆరిఫ్, షాషా, రాజారెడ్డి, రామలింగా రెడ్డి, నాగరాజు, పెద్దన్న, సుధాకర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయంపై అవగాహన ఉండాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న ధనలక్ష్మి

బనగానపల్లె రూరల్ : వ్యవసాయంపై విద్యార్థులకు అవగాహన ఉండాలని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) సీనియర్ ప్రధాన శాస్త్రవేత్త ధనలక్ష్మి సూచించారు. గురువారం మండలంలోని యాగంటిపల్లె గ్రామ సమీపంలో ఉన్న కేవీకేలో మల్లారెడ్డి విశ్వవిద్యాలయం విద్యార్థులకు మూడు నెలల గ్రామీణ వ్యవసాయ అవగాహన కార్యక్రమంలో భాగంగా కళాశాల సాంకేంతిక ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అగ్రికల్చర్ విద్య అభ్యసిస్తున్న విద్యార్థులు గ్రామీణ వ్యవసాయం పై అవగాన పెంచుకోని ఇప్పటి వ్యవసాయ స్థితిగతులకు అనుగుణంగా భవిష్యత్తులో పరిశోధనలు చేయాలని సూచించారు. శాస్త్రవేత్తలు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, భూ సారా ఆధారిత ఎరువుల వినియోగం, సస్యరక్షణ చర్యలు, పశుపోషణ, ఉద్యావన పంటల సాగు తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు లక్ష్మీప్రియ, రమణయ్య, సుధాకర్, బాలరాజు, కృష్ణమూర్తి, ఆదినారాయణ, రవిగౌడ్, మల్లారెడ్డి వ్యవసాయ కళాశాలకు చెందిన డాక్టర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.